నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్

5 | నిజామాబాద్, గురువారం 28 మార్చి 2024 | ADILABAD


## ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి..

**- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల**



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సోన్, మార్చి 27 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లాలోని సోన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రిసెప్షన్, టెక్నికల్ రూంలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది యొక్క విధులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోన్ ఎస్సై సంతోషం రవీందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ జెండా ప్రతిష్టను కాపాడాలి..

**కలెక్టర్ రాజర్షి షాకు వినతి**



కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎదులాపురం, మార్చి 27 : జాతీయ జెండాను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటింటా ఎగురవేసిన జాతీయ జెండాలు చిరిగిపోతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయడం స్వాగతించదగ్గ విషయమే. అయినప్పటికీ జెండాలను తొలగించకపోవడంతో చిరిగి పోతున్నాయన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంతోష్, నేరటి ఉదయ్‌కిరణ్, గెడ్డం రాము, కుమ్ర రాజు, మర్సుకోల బాపురావు, రాజు ఉన్నారు.

# అదిగో ఖండాల

**నాడు పచ్చదనం.. | నేడు ఎండుదనం**





చిత్రంలో కనిపిస్తున్న స్థలం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలోని ఘాట్ ప్రాంతం. అది జూలై 7, 2023. అంటే వర్షాలు దండిగా పడే కాలం. ఈ వర్షాలకు అడవి తల్లి పచ్చదనాన్ని సంతరించుకున్నది. ఎటు చూసినా పచ్చదనమే కొట్టొచ్చినట్టు కనిపించింది. కనుచూపు మేర గుట్టలు, కొండ ప్రాంతాలు, ఆకాశం అంచులు తాకుతున్నట్లు ఆకుపచ్చ అందాలతో పర్యాటకులను కనువిందు చేశాయి.

*కేసీఆర్ హయాంలో హరితహారంలో భాగంగా చెట్లు పెట్టడంతో అడవుల విస్తీర్ణం బాగా పెరిగిందని, వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. వాతావరణ సమతుల్యత ఏర్పడింది. ఇగ, కాంగ్రెస్ హయాంలో హరితహారాన్ని గాలికొదిలేశారు. చెట్ల పెంపకం లేకపోవడంతో వర్షాలు కురియడం లేదు. ఫలితంగా ఎండలు అధికం అవుతున్నాయి. దీంతో చెట్లు మోడువారి అడవి తల్లి కళావిహీనంగా మారింది.*

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మార్చి 27*

అది మార్చి 24 2024. అదే ఖండాల ఘాట్ ప్రాంతం. ఎండలు దంచికొట్టే ఎండాకాలం. వారం రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉంటున్నాయి. దీంతో పచ్చదనాన్ని సంతరించుకున్న చెట్లు కళావిహీనంగా మారాయి. ఆకులు రాలి మోడులు కనిపిస్తున్నాయి. ఎటు చూసినా ఎడారిని తలపిస్తున్నది.



# కొనుగోళ్లకు రెడీ

### ఏప్రిల్ 1వ తేదీ నుంచి ధాన్యం సేకరణ ప్రారంభం

- 203 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు
- 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- నాణ్యమైన వడ్లు తీసుకురావాలని అధికారుల విజ్ఞప్తి

నిర్మల్ టౌన్, మార్చి 27 : యాసంగి ధాన్యం సేకరణపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని పేర్కొంటున్నారు. ధాన్యం కొనేందుకు 203 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఏప్రిల్ 1 నుంచి కొనుగోళ్లను ప్రారంభించి మే చివరి వరకు సేకరణ పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. మొదట లోకేశ్వరం మండలంలో కేంద్రాన్ని ప్రారంభించి, దశలవారీగా ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ ద్వారా సేకరణ పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం వరికి గ్రేడ్-ఏ క్వింటాలు ధాన్యానికి రూ.2080.. గ్రేడ్-బీ ధాన్యానికి రూ.2,060 మద్దతు ధర ప్రకటించింది. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయంచేలా చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ ధాన్యం సేకరణ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి, సేకరణపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

#### నాణ్యమైన ధాన్యం సేకరణే లక్ష్యం

నాణ్యమైన ధాన్యం సేకరణపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. తాలు లేకుండా చూసుకోవాలని, ఇందుకోసం క్లీనింగ్ యంత్రాలను వాడాలని తెలిపారు. ప్యాడి క్లీనింగ్ మిషన్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, గోనె సంచులను సిద్ధంగా ఉం చాలన్నారు. ప్రతి కేంద్రంలో ధాన్యం తరలింపునకు లారీలు, నిల్వ చేసేందుకు రైస్‌మిల్లుల ను రెడీ చేశారు. కొనుగోలు కేంద్రంలో టెం ట్లు, నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ధాన్యం డబ్బులరె రైతు ఖాతలో జమ చేసేందుకు ట్యాబ్‌లో అ న్ని వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

#### కేంద్రాలను ఉపయోగించుకోవాలి..

**- నందిని,డీఎస్‌వో, నిర్మల్**

జిల్లాలో ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశాం. 203 కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం సేకరణను ప్రారంభించి మే చివరి నాటికి పూర్తి చేస్తాం. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి. తరలింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

**● ఎండ-42.3 డిగ్రీల సెల్సియస్**



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ చౌక్ రోడ్డు



ఎన్టీఆర్ చౌక్‌లో టర్బూజా విక్రయిస్తున్న వ్యాపారి



ఎన్టీఆర్ చౌక్‌లో నెత్తిపై చున్ని కప్పుకొని వెళ్తున్న యువతులు

# నిప్పుల కుంపటి

### రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

***ఆదిలాబాద్ జిల్లా*** *నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. రెండు రోజులుగా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. బుధవారం 42.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా జైనథ్ మండలంలోని సాత్నాలలో 42.3, తలమడుగులో 42.3, చాప్రాలలో 42.1, భీంపూర్ మండలంలోని అర్లీలో 41.9 డిగ్రీలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం జనసంచారం లేక పట్టణంలోని రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందడానికి ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వాడుతున్నారు. మార్చి నెలలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.*

***- ఆదిలాబాద్, మార్చి 27(నమస్తే తెలంగాణ)***

# అనుమానాస్పదంగా యువకుడి మృతి

- దవాఖాన యాజమాన్యంతో కుటుంబ సభ్యుల గొడవ
- కేసు నమోదు చేసిన పోలీసులు ● సూసైడ్ నోట్ లభ్యం
- ప్రేమ వ్యవహారమే కారణమా?



అర్ష లక్ష్మణ్ (ఫైల్)

నిర్మల్ అర్బన్, మార్చి 27 ః నిర్మల్ పట్టణంలోని శివాజీచౌక్ ప్రాంతంలో గల దేవీబాయి ఆసుపత్రి ఐసీయూలో విధులు నిర్వహిస్తున్న అర్ష లక్ష్మణ్(25) బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లోకేశ్వరం మండలంలోని బాగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ దవాఖానలో కొన్ని రోజులుగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కూడా విధులకు వచ్చాడు. నైట్ డ్యూటీ ముగించుకుని బుధవారం ఉదయం ఆసుపత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నిర్మల్ పట్టణ, రూరల్, సోన్ సీఐలు అనిల్, శ్రీనివాస్, నవీన్ కుమార్‌లు దవాఖానకు చేరుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రైవేట్ దవాఖాన యాజమాన్యంతో కుటుంబీకులు, బంధువులు గొడవకు దిగారు. మృతికి గల కారణాలు తెలియజేయాలని, మృతదేహాన్ని మార్చురీకి ఎందుకు తరలించారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న పోలీసులు గొడవను సద్దుమణిగేలా చేశారు. లక్ష్మణ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

#### ప్రేమ వ్యవహారమే కారణమా?

కొన్ని రోజులుగా లక్ష్మణ్ అదే దవాఖానలో పనిచేసే యువతితో చనువుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి వేరు వ్యక్తితో చనువుగా ఉంటున్నది. ఫోన్‌లో మాట్లాడుతుందని గ్రహించాడు. దీనిని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి లక్ష్మణ్ చనిపోయాడు. లక్ష్మణ్ చావుకు ప్రేమ వ్యవహారమే కారణమా? మరేదైనా కారణమా? అని సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సాగునీరు ఇవ్వకపోతే పోరాటం తప్పదు..

**బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్**

ఖానాపూర్, మార్చి 27 : ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల రైతులకు కాలువల ద్వారా యాసంగి పంటకు సరిపడా సాగు నీరవ్వకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయనను పలు మండలాల రైతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటలకు వేలల్లో పెట్టుబడి పెట్టామని, పంట చేతుకొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల ద్వారా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోగికర్ రాజు, గజేందర్, మహేందర్, నరేందర్‌రెడ్డి, పెద్ది నర్సయ్య, మహేశ్, బీరయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

# మృతదేహంతో ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

లోకేశ్వరం, మార్చి 27 : మండల కేంద్రంలోని ఓ వైన్ షాపులో మంగళవారం మద్యం సేవించి ప్రశాంత్ మృతి చెందాడు. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ గ్రామస్తులు, బంధువులు బుధవారం మృతదేహంతో ఆ వైన్‌షాపు ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ బంధువులు మాట్లాడుతూ.. పోతురాజు ప్రశాంత్ మంగళవారం ఉదయం 11 గంటలకు మద్యం సేవించడానికి వైన్ షాపులోకి వెళ్లాడన్నారు. మద్యం తాగి సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. ఈ సమయంలో మృతుని ముక్కులో నుంచి రక్తం వచ్చిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. సీసీ టీవీ ఫుటేజీని అందించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సీసీ టీవీ ఫుటేజీ వివరాలు లేవని, పోలీసులతోపాటు వైన్ షాపు సిబ్బంది చెప్పడంతో వారు ఆందోళన ఉధృతం చేశారు. భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడితో పోస్టుమార్టం పూర్తి చేయించడం ఏంటని ప్రశ్నించారు. సమగ్ర విచారణ జరిపించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని భీష్మించుకు కూర్చున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రాజును వివరణ కోరగా.. ప్రశాంత్ మద్యానికి బానిసై మద్యం మత్తులో ఉండేవాడని, మూడు రోజుల నుంచి అతిగా మద్యం తాగడం వల్ల వైన్స్ వద్దనే కుప్పకూలి మృతి చెందాడని తెలిపారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి..

- అధికారులు అంశాలపై అవగాహన ఉండి బాధ్యతతో పనిచేయాలి.. ● సమస్యాత్మక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలి..
- పార్లమెంట్ ఎన్నికలపై కో-ఆర్డినేషన్ భేటీలో జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ



మాట్లాడుతూన్న ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మార్చి 27 : ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పని చేయాలని, వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికలపై కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజర్షి షా మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 2,111 పోలింగ్ కేంద్రాలు.. 2,638 బ్యాలెట్ యూనిట్స్.. 2,638 కంట్రోల్ యూనిట్స్.. 2,908 వీవీ ప్యాడ్స్, మొబైల్ కనెక్టివిటీ 2,039.. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్ 11, ఆసిఫాబాద్ 28, ఖానాపూర్‌లో 9, ఆదిలాబాద్ 9, బోథ్ 14, నిర్మల్‌లో 1 ఇలా 72 ఉన్నాయన్నారు.

#### ఏప్రిల్ 3,4 తేదీల్లో శిక్షణ

పోలింగ్ విధులలు నిర్వహించే సిబ్బందికి వచ్చే నెల ఏప్రిల్ 3,4 తేదీల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణతోపాటు ఫామ్-12డి కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరు ఫామ్-12డి ఉపయోగించుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సివిల్ వర్క్స్ ఏమైనా ఉంటే పూర్తి చేయాలని, స్ట్రాంగ్ రూమ్, టేబుల్స్, బందోబస్తు ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. అలాగే సెక్టోరల్ అధికారులకు టీం వైస్‌గా శిక్షణ ఇవ్వాలన్నారు.

#### పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు

**- ఎస్పీ గౌష్ ఆలం**

ఇంటర్ స్టేట్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. సిగ్నల్ వ్యవస్థ లేనటు వంటి షాడో పోలింగ్‌స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్స్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతాను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో సమన్వయం కోసం ఇంటర్ స్టేట్ బోర్డింగ్ జిల్లాలతో మీటింగ్‌లను నిర్వహించడం జరిగిందన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం జిల్లాల ఏఎస్‌డీఎస్పీ, డీఎస్పీలు, పోలీస్ సిబ్బంది, ఆర్డీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# నగదు పట్టివేత

తానూర్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బెల్‌తరోడా చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని బోకర్ తాలుకా నాందేడ్ జిల్లాలోని రావణ్‌గావ్‌కు చెందిన కదం సాయినాథ్ తన కారులో రూ.1.40 లక్షలు భైంసాకు తీసుకెళ్తున్నాడు. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.